
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
7
శనివారం 18 అక్టోబరు 2025



సోలార్ పనులు పరిశీలించిన సీఎండీ



పనులకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ లోతేటి శివశంకర్

దువ్వూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం పుల్లారెడ్డిపేట సమీపంలోని గుట్టప్రాంతంలో చేపట్టిన సోలార్ విద్యుత్తు ఉత్పాదన పనులను ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ లోతేటి శివశంకర్ శుక్రవారం పరిశీలించారు. ఇక్కడ పీఎం కుసుం ఫీడర్ సోలార్ విద్యుద్దీకరణ పనులు చేపట్టారు. అయిదు మెగావాట్ల విద్యుత్తు ఉత్పాదన సామర్థ్యంతో పనులు ఇటీవలే మొదలయ్యాయి. దీని కోసం 25 ఎకరాల స్థలం కేటాయించారు. విద్యుత్తు శాఖ అధికారులతో పాటు పనులు చేస్తున్న మేఘా కంపెనీ ప్రతినిధులతో కలసి సీఎండీ లోతేటి శివశంకర్ ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. పీఎం కుసుం పథకం ద్వారా రైతులకు నాణ్యమైన విద్యుత్తును నిరంతరం సరఫరా చేయడమే లక్ష్యమని తెలిపారు. అనంతరం విద్యుత్తు అధికారులు, సిబ్బందితో ఆయన మాట్లాడారు. పనులు నిర్వహించేటప్పుడు అన్ని జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి సూచించారు. లక్ష్యాలను సాధించేందుకు సిబ్బంది అధికారుల మధ్య సమన్వయం ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట విద్యుత్తు ఎస్ఈ రమణ, ఈఈలు లక్ష్మీపతి, నాగరాజు, డీఈలు శ్రీకాంత్, శివభాస్కర్, ఏఈలు రాజ్‌కుమార్, భద్రయ్య, హరి తదతరులు పాల్గొన్నారు.

కోట్ల బకాయిలున్నా కదలరా ?

● ఉద్యోగులపై మున్సిపల్ ఈఈ ఆగ్రహం



సచివాలయ కార్యదర్శులతో సమీక్షిస్తున్న కమిషనర్, ఏసీ ఈఈ

ప్రొద్దుటూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో రూ.5 కోట్ల నీటి పన్ను బకాయిలు పేరుకున్నా సచివాలయ ఉద్యోగులు కదలరా అని మున్సిపల్ ఈఈ ఎం.శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ సభా భవనంలో సచివాలయ అమినిటీస్ శానిటరీ ప్లానింగ్ సెక్రటరీలతో నీటి పన్ను, ట్రేడ్ లైసెన్సు డిమాండ్‌లపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమీక్షలో ఈఈ మాట్లాడుతూ నీటిపన్ను బకాయి ఉన్న వారికి ఎన్ని నోటీసులు ఇచ్చారు, ఏ చర్యలు తీసుకున్నారని అమినిటిస్ కార్యదర్శులను ప్రశ్నించారు. వందల్లో కనెక్షన్లు ఉంటే పదుల సంఖ్యలో మాత్రమే నోటీసులు ఇవ్వడం ఏంటని నిలదీశారు. రూ.600 నీటి పన్ను బకాయి ఉన్నా సరే నోటీసులు ఇవ్వాలన్నారు. వేల రూపాయల బకాయిలున్న వారి కొళాయి కనెక్షన్లు తొలగించాలన్నారు. ట్రేడ్ లైసెన్సులపై అసిస్టెంట్ కమిషనర్ కొండయ్య మాట్లాడుతూ డిమాండ్‌కు తగ్గ పన్నులు వసూలు చేయడంలో ఎందుకు వెనకబడ్డారో తెలపాలన్నారు. ట్రేడ్ లైసెన్సు పరిధిలో లేకుండా ఉన్న దుకాణాలను ఎందుకు పన్ను పరిధిలోకి తీసురాలేదని అడిగారు. టౌన్ ప్లానింగ్ ఏసీపీ నాగరాజు మాట్లాడుతూ పట్టణంలో ప్లాను పర్మిషను లేకుండా ఎలాంటి నిర్మాణం జరిగినా ప్లానింగ్ సెక్రటరీలదే బాధ్యత అన్నారు. కార్యక్రమాన్ని కమిషనర్ రవిచంద్రారెడ్డి సమన్వయ పరిచారు. సమీక్షలో డీఈ రాజేష్, ఏఈ సురేంద్రారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సంస్థాగతంపై టీడీపీ గురి

● జిల్లా అధ్యక్షుడు, బద్వేలు ఇన్‌చార్జి కోసం ఐవీఆర్ఎస్ సర్వే
● జిల్లా అధ్యక్షుడి రేసులో భూపేశ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి
● బద్వేలు ఇన్‌చార్జి రేసులో సూర్యనారాయణరెడ్డి, రితీశ్‌రెడ్డి



(కడప-ఆంధ్రజ్యోతి): కడప గడపలో 2004 వరకు టీడీపీకి సమర్థవంతమైన నాయకత్వం ఉండేది. దివంగత మాజీ మంత్రి బిజివేముల వీరారెడ్డి, శివారెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్సీ రామచంద్రయ్య ఇతర నాయకత్వమంతా బలంగా ఉండేది. ఆ దశకంలో జిల్లాలో వైఎస్ కుటుంబం కాంగ్రెస్‌లో ఉండేది. ఆ సమయంలో వీరారెడ్డి, రామచంద్రయ్య, తులసిరెడ్డి ఇతరత్రా నాయకులు వైఎస్ కుటుంబానికి ధీటుగా సమాధానమిస్తూ టీడీపీని కాపాడుకుంటూ వచ్చారు. అప్పట్లో టీడీపీలో చాలా పవర్‌ఫుల్ లీడర్‌షిప్ ఉండేది. 2004 తరువాత మొత్తం తారుమారు అయింది. అయితే గత ఏడాది జరిగిన ఎన్నికల్లో ఐదు అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు గెలవగా.. ఇందులో నాలుగు స్థానాల్లో టీడీపీ వారే ఉండటం గమనార్హం. దీంతో టీడీపీకి జిల్లాలో పూర్వవైభవం మొదలైంది. ఈ నేపథ్యంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడి ఎంపిక విషయంలో అధిష్టానం ఆచితూచి అడుగులు వేస్తోంది. దీనికోసం ఇప్పుడు ఆ పార్టీ నుంచి ఐవీఆర్ఎస్ కాల్స్ వస్తున్నాయి.

అధ్యక్ష పదవికి పోటీ

జిల్లా టీడీపీ అధ్యక్ష పదవిపై అందరి కన్ను ఉంది. టీడీపీలో సంస్థాగత ఎన్నికలు ప్రతి ఏడాది జరుగుతుంటాయి. జాతీయ అధ్యక్షుడు నుంచి మండల అధ్యక్షుడి వరకు ఎన్నికలు జరుగుతూనే ఉంటాయి. అయితే ఈసారి కడప జిల్లా అధ్యక్ష ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. ప్రస్తుతం టీడీపీ జిల్లా అధ్యక్ష పదవి అంటే దాదాపు ఇన్‌చార్జి మంత్రి స్థాయి అని చెబుతారు. ఈ నేపథ్యంలో జిల్లా అధ్యక్ష పదవికి భూపేశ్‌రెడ్డి, ఆర్.శ్రీనివాసరెడ్డి పేర్లు ఐవీఆర్ఎస్ ద్వారా వినిపిస్తున్నాయి. ఈ పదవి కోసం మొదట్లో కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు ఎస్.గోవర్ధనరెడ్డి, బి.హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, పోట్లదుర్తికి చెందిన సీఎం సురేశ్‌నాయుడు, ఇతరుల పేర్లు ప్రముఖంగా వినిపించాయి. ఇప్పుడు టీడీపీ జిల్లా అధ్యక్షునిగా భూపేశ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి పేరిట ఐవీఆర్ఎస్ కాల్స్ చేయడం గమనార్హం.

బద్వేలులో మార్పు

బద్వేలు నియోజకవర్గం ఒకప్పుడు టీడీపీకి కంచుకోట. బద్వేలు అంటేనే మాజీ మంత్రి దివంగత వీరారెడ్డి గుర్తుకు వస్తారు. 2001 ఎన్నికల ముందు వరకు బద్వేలులో టీడీపీ గెలుస్తూ వచ్చేది. ఇప్పుడు ఆ నియోజకవర్గం వైసీపీకి వన్‌సైడ్ అయింది. కేవలం టీడీపీ తప్పిదాలు, ముఖ్య నేతల క్యాస్ట్ ఫీలింగ్, అహం కారణంగానే టీడీపీ సంప్రదాయ ఓట్లను పోగొట్టుకున్నారు. ఈ విషయాన్ని పార్టీ గుర్తించి ఇప్పుడు దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే ఇన్‌చార్జ్‌గా సూర్యనారాయణరెడ్డి, రితీశ్‌రెడ్డి పేర్లు ఐవీఆర్ ద్వారా సర్వే చేస్తోంది. జిల్లాలో పార్టీ పటిష్టత కోసం అధిష్టానం దిద్దుబాటు చర్యలు చేపట్టినట్లు ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నారు.

ఎర్రచందనం స్మగ్లర్ లతీఫ్ బాషాపై పీడీయాక్ట్

కలికిరి / ప్రొద్దుటూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లర్ లతీఫ్ బాషాపై పీడీ యాక్టు విధించారు. ప్రొద్దుటూరు భగత్‌సింగ్ కాలనీకి చెందిన గాండ్లూరు లతీఫ్ బాషా (24)పై ఎర్రచందనం అక్రమ రవాణాలో వివిధ రకాల కేసులు నమోదు కావడంతో అతనిపై పీడీ యాక్టు కింద కేసు నమోదు చేసి నిర్బంధంలోకి తీసుకోవాలని సెప్టెంబరు 8న కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. 2021 నుంచి ఇతనిపై మొత్తం 30 కేసులు నమోదయ్యాయి. అరెస్టు కావడం, బెయిల్‌పై విడుదలవడం పరిపాటిగా మారింది. అయినా అతనిలో ఏ మార్పు లేదు. ఎర్రచందనం చెట్లను నరకడం, వాటిని డంపింగ్ చేసి రవాణా చేయడం ఆపలేదు. దీంతో అతనిపై కలెక్టర్ విధించిన పీడీ యాక్టు నిర్బంధ ఉత్తర్వులను ప్రభుత్వం కూడా ఆమోదించింది. చట్ట ప్రకారం పీడీ యాక్టు కింద వ్యక్తిని నిర్బంధించిన మూడు వారాల్లోగా కేసును రాష్ట్ర స్థాయిలో ఉన్న నలుగురు సభ్యుల అడ్వయిజరీ బోర్డు ముందు విచారణకు ఉంచాల్సి ఉంది. ఆ ప్రకారం ఈ నెల 7న అడ్వయిజరీ బోర్డు చైర్మన్ వీడియో కాన్ఫరెన్సు ద్వారా నిందితుడితో పాటు సంబంధిత అధికారులను విచారించారు. ఇందులో ప్రధానంగా ఐదు కేసుల్లోని తీవ్రతను, దానిపై నమోదయిన దాదాపు 20 రకాల సెక్షన్లను పరిశీలించిన సలహా బోర్డు లతీఫ్ బాషాను పీడీ యాక్టు కింద నిర్బంధించడాన్ని సమర్థించింది. దీంతో అతడిని నిర్బంధంలోకి తీసుకున్న సెప్టెంబరు 8వ తేదీ నుంచి ఏడాదిపాటు పీడీ యాక్టు అమలులో ఉంటుందని ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. అలాగే ప్రొద్దుటూరు టీచర్స్ కాలనీలో నివాసమున్న దువ్వూరు మండలం పుల్లారెడ్డిపేటకు చెందిన ఇరగంరెడ్డి నాగదస్తగిరిరెడ్డిపై పీడీ యాక్ట్ నమోదుకు కలెక్టర్ ఈ నెల 7న ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి ప్రభుత్వం అనుమతించింది. అయితే మూడు వారాల్లోగా దీనిని రాష్ట్ర స్థాయి సలహా బోర్డు సమీక్షించి ధ్రువీకరించాల్సి ఉంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం రెండు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు.

టపాసుల విక్రయాలకు అనుమతులు తప్పనిసరి : ఎస్పీ

కడప క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా చర్యలు తప్పవని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ కలిగిన దుకాణదారులు మాత్రమే బాణసంచా విక్రయాలు చేయాలని పేర్కొన్నారు. సూచించిన బహిరంగప్రదేశాల్లో వారికి కేటాయించిన ప్రాంతంలో నిర్ణీత కొలతల మేరకు ప్రత్యేక షెడ్లలో దుకాణాలు ఏర్పాటు చేసుకుని నిబంధనలు పక్కాగా పాటించాలని సూచించారు. లైసెన్సు పొందిన పర్మినెంటు గోడౌన్లు, షాపులు సైతం నిబంధనలు పాటించాలని తెలిపారు. షాపుల ఏర్పాటులో ప్రమాదాలకు తావులేకుండా సరైన భద్రతా ప్రమాణాలు పాటించాలని, ప్రతి దుకాణం వద్ద నీరు, ఇసుక అగ్నిమాపక యంత్రాలు తప్పకుండా ఉండాలని సూచించారు. ప్రజలు సైతం లైసెన్సు ఉన్న దుకాణంలో టపాసులు కొనుగోలు చేయాలని, ఎక్కడైనా ప్రమాదం చోటు చేసుకుంటే డయల్ 112కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

ఏ ఎన్నికలైనా.. గెలుపే లక్ష్యం

● మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి



విలేకరులతో మాట్లాడుతున్న బీటెక్ రవి

పులివెందుల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏ ఎన్నికలు వచ్చినా ప్రత్యర్థి ఎవరన్నది చూడమని గెలవడమే తమ లక్ష్యమని మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ పులివెందుల మున్సిపాలిటీ బాధ్యతలను దుష్యంత్‌రెడ్డికి అప్పగిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయన్నారు. ఎవరు వచ్చినా తమ గెలుపును ఆపలేరన్నారు. సాగునీటి సంఘం ఎన్నికల్లో ఒక వ్యూహాన్ని, జడ్పీటీసీ ఎన్నికల్లో మరో వ్యూహాన్ని అమలు చేశామన్నారు. త్వరలో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కొత్త వ్యూహంతో వచ్చి మున్సిపాలిటీని కొట్టడం ఖాయమన్నారు. నిజంగా పార్టీకి సేవ చేసిన వారిని కౌన్సిలర్లుగా, చైర్మన్‌గా గెలిపించుకోవడమే తమ లక్ష్యమన్నారు. నిన్న జరిగిన జడ్పీటీసీ ఎన్నికల్లో ఎర్రబల్లెచెరువుకు నీరిస్తామని చెప్పామని.. ఆ మాట ప్రకారం 40 రోజులుగా చెరువుకు నీళ్లు వస్తూనే ఉన్నాయన్నారు. మరో వారం పదిరోజుల్లో చెరువు నిండుతుందన్నారు. ఇప్పటికే ఆ చెరువు కింద ఉన్న బోర్లు రీచార్జ్ అయి రూ.100 కోట్ల నుంచి రూ.150కోట్లు రైతులకు ఆదా అయిందన్నారు. ఒకే ఇంట్లో ఇద్దరు ముఖ్యమంత్రులు అయినప్పటికి ఇక్కడ పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పులివెందులలో తాగునీటి సమస్య తీర్చామన్నారు. డిసెంబరు నాటికి వాటర్‌గ్రిడ్ పనులు పూర్తిచేసి ముఖ్యమంత్రిచే ప్రారంభింప జేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అమర్‌నాథయాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్‌తో జగన్‌రెడ్డికి చెక్

● ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఆదినారాయణరెడ్డి

కడప మారుతీనగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన సూపర్ సిక్స్ హామీలను దిగ్విజయంగా అందిస్తూ జగన్‌రెడ్డికి సూపర్ చెక్ పెట్టామని జమ్మలమడుగు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం కడప ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లిక్కర్ స్కాంలో వైసీపీ నాయకులు ఇప్పటికే ఊసలు లెక్కిస్తున్నారని ప్రస్తుతం లిక్కర్-2 కేసులో సైతం మొత్తం వైసీపీకి చెందినవారే ఉన్నారని అన్నారు. ఐటీఐకి, ఐఐటీకి తేడా తెలియని జగన్‌రెడ్డి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ముఖ చిత్రం కేవలం కొద్దినెలల్లోనే మారుతుందన్నారు. కర్నూలులో నిర్వహించిన సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ బహిరంగసభ విజయవంతం కావడంతో రాష్ట్ర ప్రజల్లో కూటమి ప్రభుత్వం పట్ల మరింత విశ్వసనీయత పెరిగిందన్నారు. గత ఐదు సంవత్సరాల జగన్‌రెడ్డి పాలనలో జరిగిన నష్టాన్ని పూడ్చి రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సాయం అందిస్తోందన్నారు. కొత్త పరిశ్రమలను తీసుకువచ్చి రాష్ట్రాన్ని పారిశ్రామిక హబ్‌గా చేసేందుకు కేంద్రం అన్ని రకాలుగా సాయం చేస్తోందన్నారు. ఇప్పటికే జిల్లాలోని కొప్పర్తి పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కోట్లాది రూపాయలు కేంద్ర ఇచ్చిందన్నారు. ఆ కోవలో బద్వేలు-నెల్లూరు రోడ్డు నిర్మాణానికి రూ.3500 కోట్లు, అలాగే 12వేల మెగావాట్ల సోలార్ ఉత్పత్తికి రంగం సిద్ధం చేసిందన్నారు. కడప స్టీలుప్లాంటుకు మహర్దశ పట్టనుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి రాష్ట్రంలో, జిల్లాలో స్థానమే లేకుండా చేస్తామన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అబార్షన్లపై ఆడిట్

ప్రొద్దుటూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు డివిజన్ పరిధిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ట్రైమిస్టర్ అబార్షన్లపై వైద్యాధికారులు ఆడిట్ నిర్వహించారు. శుక్రవారం ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలోని పీపీ యూనిట్‌లో జమ్మలమడుగు డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత, గైనకాలజిస్టు డాక్టర్ సువిధ కలసి ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్ పరిధిలో అవసరం లేకున్నా అబార్షన్లు చేయించుకుంటున్నారన్నారు. మొదటి, రెండవ కాన్పులో ఆడపిల్లలు పుట్టిన వారు అబార్షన్ చేయించుకుంటున్నారన్నారు. ఎక్కడ అబార్షన్లు ఎక్కువ చేయించుకుంటున్నారో సంబంధించిన ప్రైవేటు ఆసుపత్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

విచారణలో ఏం చెప్పారో...!

● నకిలీ మద్యం కేసు నిందితుల కస్టడీ
● ప్రశ్నిస్తున్న సిట్‌బృందం అధికారి, కడప అసిస్టెంట్ డైరెక్టర్
● ఒక్కొక్కరిని వేర్వేరుగా విచారణ



విచారణ కోసం సబ్‌జైలు నుంచి కట్టా సురేంద్రనాయుడుని తీసుకొస్తున్న పోలీసులు

మదనపల్లె/ములకలచెరువు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెను సంచలనంగా మారిన ములకలచెరువు నకిలీ మద్యం కేసు విచారణ కీలక దశకు చేరుకుంటోంది. తంబళ్లపల్లె కోర్టు ఆదేశాల మేరకు మదనపల్లె సబ్‌జైలులో ఉన్న పదిమంది నిందితులను శుక్రవారం ఉదయం 10.40 గంటల సమయంలో ఎక్సైజ్ అధికారులు కస్టడీకి తీసుకున్నారు. ప్రత్యేక బలగాల మధ్య నిందితులను తొలుత జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం నక్కలదిన్నె సమీపంలోని ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. విజయవాడ నుంచి వచ్చిన సిట్‌బృందం అధికారి శ్రీనివాసరావు, కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఏఈఎస్ జోగేంద్ర నిందితులను ప్రశ్నిస్తున్నారు. ఒక్కో నిందితుడిని వేర్వేరుగా విచారిస్తున్నారు.

ములకలచెరువు కేంద్రంగా జరిగిన నకిలీ మద్యం తయారీ కేంద్రంపై ఈ నెల 3న ఎక్సైజ్ ఉన్నతాధికారులు దాడులు నిర్వహించి కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన సయ్యద్ హాజీ, విశాఖపట్నానికి చెందిన చుక్కల బాలరాజు, తమిళనాడుకు చెందిన గణేషన్ మనిమారమ్, అనంతన్ శ్రీనివాసన్, సూర్య జగదీషన్, వెంకటేషన్ సురేష్, ఒడిషాకు చెందిన మిథున్‌దాస్, అంతదాస్‌లతో పాటు పెద్దతిప్పసముద్రం మండలం కమ్మవారిపల్లెకు చెందిన కట్టా సురేంద్రనాయుడు, రంగసముద్రానికి చెందిన బెల్ట్‌షాపు నిర్వాహకుడు నాగరాజులను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం మదనపల్లె సబ్‌జైలుకు తరలించారు. ఈ పదిమంది నిందితుల నుంచి కేసుకు సంబంధించి పూర్తి వివరాలు రాబట్టాలని ఎక్సైజ్ అధికారులు తంబళ్లపల్లె కోర్టులో కస్టడీ పిటీషన్‌ను దాఖలు చేయడంతో జడ్జి ఉమర్ ఫరూక్ అనుమతించారు. ఇందులో తొమ్మిది మంది నిందితులను రెండురోజుల పాటు, కట్టా సురేంద్రనాయుడును మూడురోజులు కస్టడీకి ఇచ్చారు. ఈ నేపథ్యంలో పదిమంది నిందితులను మదనపల్లె సబ్‌జైలు నుంచి కస్టడీకి తీసుకుని ఎక్సైజ్ స్టేషన్‌లో విచారిస్తున్నారు. ములకలచెరువు ఆర్‌ఐ ఇమ్రాన్ సమక్షంలో విచారించి పంచనామా రాశారు.

ఇద్దరే కీలకం

ఈ విచారణలో కట్టా సురేంద్రనాయుడు, ఇబ్రహీంపట్నానికి చెందిన సయ్యద్ హాజీల విచారణ కీలకంగా మారింది. ప్రధాన నిందితుడు జనార్దన్‌రావు అనుచరుడైన సయ్యద్ హాజీ, కట్టా సురేంద్రనాయుడు విచారణలో ఏం చెబుతారోనని ఉత్కంఠ నెలకొంది. వీరిద్దరిని ఉన్నతాధికారులు కస్టడీలో అధికంగా విచారించి కీలక విషయాలు రాబడుతున్నట్లు తెలుస్తోంది. వీరిద్దరూ కీలక వ్యక్తులు కాగా, మిగిలిన వారంతా ఇతర ప్రాంతాల నుంచి కూలి పనులకు వచ్చిన వారే. తొమ్మిది మంది నిందితులను రెండోరోజు శనివారం విచారణ అనంతరం తిరిగి సబ్‌జైలుకు తీసుకెళ్లి అప్పగించనున్నారు. కీలక నిందితుడైన కట్టా సురేంద్రనాయుడును మూడోరోజు ఆదివారం కూడా విచారించనున్నారు.

ప్రత్యేక భవనం ఎప్పుడు..?

● ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కాన్పుల కష్టాలు
● పడకలు చాలక ఇబ్బందిపడుతున్న వైనం
● శాశ్వత భవనం ప్రతిపాదనలకే పరిమితమా?



కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కాన్పుల వార్డు


కడప సెవెన్ రోడ్స్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కాన్పులు చేయడంలో మంచిపేరు తెచ్చుకుంది. చుట్టుపక్కల జిల్లాల నుంచి కూడా సర్వజన ఆసుపత్రికి కాన్పుల కోసం వచ్చేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ప్రభుత్వ ఆసుపత్రిలో చాలావరకు సిజేరియన్ కాకుండా సాధారణ కాన్పులు చేసేందుకే ప్రయత్నిస్తున్నారు. దీనికి తోడు కాన్పుచేసే సమయంలో ఎటువంటి ఇబ్బంది తలెత్తినా.. అన్ని వసతులతో పాటు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండడం కూడా రోగుల సంఖ్య పెరగడానికి కారణం. ఇలాంటి ఆసుపత్రిలో తగినన్ని పడకలు లేక కాన్పులకోసం వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ కాన్పు చేయాలంటే రూ.30వేల నుంచి రూ.50వేలు వసూలు చేస్తున్నారు. అదే ప్రభుత్వ ఆసుపత్రిలో అయితే ఉచితంగా కాన్పు చేయడమే కాకుండా రూ.5వేలు తల్లీబిడ్డకు అందిస్తారు. చాలా వరకు సర్వజన ఆసుపత్రిలో ఆపరేషన్ లేని సాధారణ ప్రసవాన్ని చేస్తారు. దీనితో ఎక్కువ మంది పేదలు కాన్పుల కోసం ఇక్కడికే వస్తున్నారు. సర్వజన ఆసుపత్రిలో సరాసరిన నెలకు 400 కాన్పులు చేస్తున్నారు. ప్రతిరోజు ఓపీ 150 మంది చూపించుకుంటారు. రోజుకు 10 నుంచి 15 ఆపరేషన్లు జరుగుతాయి. 80 మంది అడ్మిషన్లు పొందుతుంటారు. వీరికి 23 మంది వైద్యులు వైద్య సేవలు అందిస్తారు. అదనంగా నర్సులు, ఆయాలు, ఇతర వైద్య సిబ్బంది మామూలే. కాన్పుల కోసం వచ్చే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడంతో పడకలు సరిపోవడం లేదు. ఒక్కోసారి ఒక్కో పడకపై ఇద్దరేసి రోగులకు వైద్యం అందిస్తుంటారు. కాన్పుల కోసం వచ్చే వారి బంధువులు, సహాయకులతో ఆసుపత్రి పరిసరాలు ఒక్కోసారి నిండిపోతుంటాయి. ప్రత్యేక భవనం, అదనపు పడకలు వస్తే అందరికీ వెసులుబాటుగా వైద్యాన్ని అందించేందుకు అవకాశం ఉంటుంది.

ప్రత్యేక భవనం ప్రతిపాదనలతో సరి

కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని కాన్పుల వార్డులో రోగుల సంఖ్య రోజురోజుకు అధికమవడంతో ప్రత్యేక భవనం కావాలంటూ ప్రతిపాదనలు చేసినప్పటికి ఫలితం లేకుండా ఉంది. 2006లో ఆసుపత్రి ప్రారంభించినప్పుడు కాన్పుల వార్డుకు 30 పడకలు కేటాయించారు. ప్రస్తుతం 120 పడకలు ఉన్నాయి. అవసరాన్ని బట్టి ఆసుపత్రి అధికారులే మరో 40 అదనపు పడకలతో వైద్యం అందిస్తున్నారు. కొన్ని అత్యవసర సందర్భాల్లో అవసరాన్ని బట్టి 200 పడకలను వినియోగిస్తున్నామని వైద్యులు అంటున్నారు. అయితే రోజుకు 10 నుంచి 15 కాన్పులు, 80 మంది అడ్మిషన్లు పొందే ఈ వార్డులో 120 పడకలు ఏమాత్రం సరిపోవు. ఆసుపత్రి అధికారులు ఈ సంఖ్య 200 చేసినా ఇది తాత్కాలికమే. దీనితో వచ్చిన వారిని ఆసుపత్రిలో చేర్చుకోలేక వైద్యులు.. బయట ఖరీదైన వైద్యం చేయించుకోలేక పేదలు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం సర్వజన ఆసుపత్రికి వస్తున్నవారి సంఖ్య ప్రకారం కాన్పులవార్డు కోసం ప్రత్యేకంగా 300 పడకలతో భవనం ఏర్పాటుచేయాల్సి ఉంటుందని అధికారులు గుర్తించారు. ఈ మేరకు పలుమార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇవన్నీ ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. 300 పడకలతో ప్రసూతిభవనం ప్రత్యేకంగా ఏర్పాటుచేయడానికి సుమారు రూ.90కోట్లు ఖర్చు అవుతుందని ఏపీఎంఎస్ఐడీసీ ప్రభుత్వానికి నివేదించింది. ఇది ఎప్పటికి ఆచరణలోకి వస్తుందో చూడాలి మరి.

ప్రతిపాదనలు పంపాము



ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి గర్భిణీలు, గర్భకోశ వ్యాధుల సమస్యలపై వస్తున్న వారి సంఖ్య అధికంగా ఉంది. ఇతర విభాగాలతో పోలిస్తే 50శాతం అధికంగా రోగులు వస్తున్నారు. చిన్నపిల్లలు, గర్భిణీల వైద్యం కోసం 300 పడకల ఎంసీహెచ్ బ్లాక్ కావాలని ప్రతిపాదనలు పంపాం. ఇందుకు సుమారు రూ.90కోట్లు ఖర్చు అవుతుందని ఏపీఎంఎస్ఐడీసీ ప్రభుత్వానికి తెలిపింది. మెరుగైన వైద్యసేవలు అందించడానికి వైద్యులు, సిబ్బంది నిరంతరం కృషిచేస్తున్నారు.

- వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, కడప సర్వజన ఆసుపత్రి

ANNAMACHARYA
INSTITUTE OF TECHNOLOGY AND SCIENCES - KADAPA
(Autonomous)
(Approved by AICTE, & Affiliated to JNTUA, Anantapur)
Accredited by NBA (B.Tech - EEE, ECE & CSE) & NAAC "A" Grade
Estd : 2010
Utukur (P), C.K. Dinne (V&M), Kadapa Dist., A.P.-516003, web : www.aitskadapa.ac.in
EAPCET / ECET / PGECET / ICET CODE : AITK
ADMISSION NOTIFICATION FOR CATEGORY - 'B' SEATS - 2025-26
Applications are invited from eligible candidates for admission into 1st year B.Tech under Category 'B' (Non-NRI & Unfilled NRI) seats are available in CE, EEE, ME, ECE, CSE, Artificial Intelligence and Data Science & CSE (Artificial Intelligence & Machine Learning) branches for the academic year 2025-26. Admissions will be made as per the guidelines of APSCHE.
For further details contact : 96039 99591 PRINCIPAL

అధికారులు పక్కా ప్రణాళికతో రావాలి : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

వల్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అధికారులు సమావేశానికి వచ్చేటప్పుడు పక్కా ప్రణాళికలతో రావాలని రివ్యూ ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. శుక్రవారం మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ అధికారులు ఏదో వచ్చాం, పోయాం అన్నట్లు కాకుండా గత సమావేశంలో ఏం చర్చించామో అవి పూర్తయ్యాయా లేదా, రివ్యూమీటింగ్ అంటే గతంలో ఏం పనులకు మనం ప్రయార్టీ ఇచ్చామో తెలుసుకోవాలని సూచించారు. అలా కాకుండా ఉంటే కూటమి ప్రభుత్వంలో కుదరదన్నారు. ముఖ్యంగా తాగునీటి సమస్య, పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. ఎ.ఓబాయపల్లె, వల్లూరు, దిగువపల్లెగోటూరు తదితర ప్రాంతాల తాగునీటి, పారిశుధ్యంపై అధికారులు సమస్యలు పరిష్కరించాలన్నారు. రెవెన్యూ పనులకు సంబంధించిన సమస్యలపై తహసీల్దారు శ్రీవాణి చదివి వినిపించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రఘురాం, ఉప మండలా ధ్యక్షురాలు లక్ష్మీదేవి, వీపీసీఎస్ అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు సుధాకరరెడ్డి, రాఘవరెడ్డి, సుదర్శనరెడ్డి, లక్ష్మీరెడ్డి, ఓబులరెడ్డి, విజయేంద్రరెడ్డి,శివారెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తు చేసుకోవాలి

చెన్నూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాలపల్లెలో వెలసిన కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానానికి నూతన ధర్మకర్తల మండలి నియామకానికి గాను ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ ఈవో శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్ర దేవదాయ శాఖ ఆదేశాల మేరకు ఇందుకోసం నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఆసక్తి గల వారు 20లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

పులివెందులలో ప్రజాదర్బార్

పులివెందుల టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం పులివెందులలోని టీడీపీ కార్యాలయంలో ప్రజాకార్యక్రమంలో పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి పాల్గొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యకర్తలు, ప్రజల సమస్య లను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పింఛన్, రేషన్‌కార్డు, విద్య, వైద్యం, ఉద్యోగాలు ఇప్పించాలని కోరుతూ ప్రజలు అర్జీలు ఇచ్చారు. కొన్ని సమస్యలు ఫోన్‌లో మాట్లాడి పరిష్కారం చేశారు.

WANTED
కడపజిల్లా యందలి 220 KV సబ్‌స్టేషన్‌లో తాత్కాలికముగా పనిచేయుటకు Diploma / B.Tech. ఎలక్ట్రికల్ మరియు ITI కలిగిన ఆసక్తి కలవారు సంప్రదించగలరు.
Cell No. : 9490183662
73968 82377

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిని ఖండిద్దాం



కమలాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు17 (ఆంధ్ర జ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించాలని జిల్లా పౌర సమాజం ప్రతినిధులు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా పౌర సమాజం కార్యాలయంలో వారు మాట్లాడుతూ 19న ఉదయం 10గంటలకు బీసీ భవన్‌లో జిల్లా పౌర సమాజం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్న ట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, ప్రముఖ లాయర్ ఎ.సంపత్ కుమార్, డాక్టర్ మల్లెల భాస్కర్ పాల్గొన్నారు.

కమలాపురం రూరల్..: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి ప్రయత్నించిన లాయర్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరసింహ మాదిగ తెలిపారు. శుక్రవారం కమలాపురంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు జ్యోతికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

చెన్నూరు..: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడి చేసిన వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ చెన్నూరు మండలశాఖ అధ్యక్షుడు బాలయ్యమాదిగ, కార్యదర్శి రాంబాబు మాదిగ అన్నారు. ఈ మేరకు తహసీల్దారు సరస్వతికి శుక్రవారం వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో తూపల్లె వెంకట సుబ్బయ్య, సుదర్శన్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో వేగవంతం



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నగర అధ్యక్షుడు మన్సూర్ అలీఖాన్

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు17 (ఆంధ్ర జ్యోతి) డబుల్ ఇంజన్ సర్కార్ సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని కడప నగర టీడీపీ అధ్యక్షుడు పి.మన్సూర్ అలీఖాన్ తెలిపారు. శుక్రవారం కడప నగరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని మోదీ కర్నూలు పర్యటనలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో ఆంధ్రరాష్ట్ర అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని ప్రకటించడం సంతోషకరమన్నారు. అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషివల్ల సాధ్యమైందని మోదీ ప్రశంసించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సుబ్బారెడ్డి, సిలాస్, వెంకటేశ్, నరేష్, బాబా ఫక్రుద్దీన్, సుబ్బరాయుడు,యూనస్ బాష పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన వీఆర్‌ఏల సంఘం నేతలు

పులివెందుల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మండలిలో వీఆర్‌ఏల సమస్యలు ప్రస్తావించారని వాటి పరిష్కారానికి ఆయన కృషిచేశారని, రాష్ట్ర గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. శుకవారం వీఆర్‌ఏల సంఘం ప్రతినిధులు ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఇంటి వద్ద కలిసి శాలువ కప్పి మొక్కను అందించారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం నాయకులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE
Under the instructions of my client M/s Shriram finance ltd vempalli branch issues the following notice to the general public. My client intend to grant loan to **Smt. Shaik Bigala Faridha** residing at Dno:-12/5 medhara veedi vempalli town Kadapa dt by mortgage. As such if anyone has any claims ,objections charges or mortgages sale agreements, court attachments court disputes etc, shall be informed to the address mentioned below in within 5 days from the date of this notice ,other wise matter objections will not bind on my client not bind on my client in the regard. SCHEDULE OF THE PROPERTIES : YSR dist kadapa Registration dist, vempalli sub district, vempalli municipal area vempalli town near ITI college 13th ward as panchayat board Residential vacant site Situated At SY No : 365 vempalli village Village Field & Panchayath, At Mandal Of YSR Dist An Extent of 4.38 Cents with in the following **Boundaries :** EAST : employees wide plots, WEST : rasta, NORTH : panga subbarayudu open site, SOUTH :20 cubits open site of executant.
A. PRATHAP REDDY
ADVOCATE, PULIVENDULA

ఘనంగా శ్రీక్రిష్ణదేవరాయలు వర్ధంతి


క్రిష్ణదేవరాయల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ, జనసేన, బలిజ సంఘం నాయకులు

కడప మారుతీనగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీక్రిష్ణదేవరాయలు గొప్ప పరిపాలనాదక్షుడని టీడీపీ, జనసేన, శ్రీక్రిష్ణదేవరాయల బలిజ సంక్షేమ సంఘం నాయకులు కొనియాడారు. శ్రీక్రిష్ణదేవరాయల వర్ధంతి సందర్భంగా నగర క్రిష్ణసర్కిల్‌లో ఉన్న శ్రీక్రిష్ణదేవ రాయల విగ్రహానికి వారు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.హరిప్రసాద్, జనసేన నాయకులు సుంకర శ్రీనివాస్, తుంగ రమణయ్య, జీవీ రమణ, బలిజ సంఘం నాయకులు సగినాల శ్రీనివాసులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొమ్మిశెట్టి చంద్రశేఖర్, రాంప్రసాద్, ముగ్గురాళ్ల అమరప్ప, బలిజ సంఘం నాయకులు నాగరాజు, జి.ప్రసాద్, బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

రేపు పుస్తక పరిచయ సభ


కడప కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కలియుగ దాన కర్ణుడు మహాదాత బుడ్డా వెంగల్‌రెడ్డి జీవిత చరిత్ర పుస్తక పరిచయ సభ ఈ నెల 19న ఆదివారం ఉదయ 10గంటలకు నగర హౌసింగ్‌బోర్డు కాలనీ కోదండ రామాలయంలో జరగనుంది. సభకు అధ్యక్షత కడప మాజీ మున్సిపల్ చైర్మన్ ఎస్.హరీంద్రనాథ్ వహించనున్నారు. పలువురు నగర ప్రముఖులు హాజరు కానున్నారు.

సమస్యలు పరిష్కరించండి

కడప నాగరాజుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కాంట్రాక్టు కార్మిక, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్ఈ ధర్నాచేపట్టారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి పి.సుదర్శన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రోడ్డుకు మోక్షం

వేంపల్లె, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు వేంపల్లె పట్టణంలో రోడ్డుకు మోక్షం కలగడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో జరుగుతున్న రోడ్డు విస్తరణపనులను ఆయన పరిశీలించారు. విస్తరణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయిన కారణంగా అప్పటికే ఉన్న రోడ్డును తవ్వడం జరిగిందన్నారు. దీనితో ప్రజలు రెండున్నరేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. మళ్లీ పనులు ప్రారంభించడంతో సంతోషం వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.






















ఎడతెరిపి లేని వర్షం.. పూల రైతుకు కష్టం

- కిలో రూ.40కి పడిపోయిన ధర
- లబోదిబోమంటున్న రైతన్నలు

రాజుపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేని వర్షాలతో పూల రైతులకు కష్టాలు నష్టాలు తప్పడం లేదు. గత 15 రోజులుగా రోజూ వర్షం పడుతుండడంతో దిగుబడి తగ్గడంతో పాటు రేటు కూడా పతన మైందని పూలరైతులు ఆవేదన చెందుతున్నారు.

రాజుపాలెం మండలంలోని టంగుటూరు, దువ్వూరు మండలంలోని క్రిష్ణంపల్లె, బయనపల్లె, జిల్లెల్ల, కానగూడూరు గ్రామాల్లో కుందూనది పరివాహక ప్రాంతంలో బోర్ల కింద దాదాపు 200 ఎకరాల్లో చామంతి, రోజాపూలు, కాకడాలు, మల్లెలు, కనకాంబరాల పూలతోటలు సాగులో ఉన్నాయి. అయితే గత నెల దసరా ఉత్సవాల్లో అధిక రేట్లు పలికిన పూల ధరలు క్రమేణా వర్షాలు అధికం కావడంతో పూల దిగుబడులు తగ్గాయి. ఇక రోజూ వర్షం పడుతుండడంతో గిట్టుబాటు ధర కూడా లేదు. కానగూడూరు మార్కెట్లో కిలో రూ.30 నుంచి 40 పలుకుతుండడంతో కూలీల ఖర్చు కూడా రాదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఒక కూలీకి రూ.250 కూలి డబ్బులు చెల్లిస్తుంటే... రోజుకు 5 నుంచి 10 కేజీలు మాత్రమే పూలు కోస్తారని.. కనీసం కూలీ డబ్బులు కూడా రావడం లేదన్నారు. గతంలో బంతి పూలు రూ.50 నుంచి రూ. 200 అమ్మిన రోజులు కూడా ఉన్నాయని, ఇప్పుడు ఆ రేటు రావడం లేదని రైతులు వాపోయారు.

ఒక వారం ఇలాగే వర్షాలు కొనసాగితే పంట తీసేయడం తప్ప వేరే మార్గం లేదని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. అలాగే పూల సాగు చేపట్టే రైతులకు రాయితీ రూపంలో మొక్కలు, పురుగుమందులు అందించాలని కోరుతున్నారు.

ఉచిత డ్రైవింగ్ శిక్షణకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి

కడప ఎన్టీఆర్ సర్కిల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భారీ మోటరు వాహనాల డ్రైవింగ్‌లో ఎస్సీలకు ఉచిత శిక్షణ కోసం శుక్రవారం ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు డాక్టర్ జి.రాజ్యలక్ష్మి ఇంటర్వ్యూలు నిర్వహించారు. లైట్ మోటరు వెహికల్ లైసెన్సు కలిగిన 20 నుంచి 40 సంవత్సరాల్లోపు వయసున్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరారు. ఈ మేరకు జిల్లాలో 16 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంట ర్వ్యూలకు 15 మంది హాజరయ్యారు. వీరిలో నుంచి పది మందిని ఎంపిక చేయనున్నట్లు ఈడీ తెలిపారు. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు ఏపీఎస్ఆర్టీసీ మేనేజరు ఆధ్వర్యంలో భారీ మోటరు వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చి, శిక్షణ పూర్తయ్యాక అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ ప్రసాద్, ఆర్టీసీ డీఎం కన్యాకుమారి పాల్గొన్నారు.

విద్యుత్తు షాక్‌కు గురై వ్యక్తి మృతి



రాంబాబు మృతదేహం

జమ్మలమడుగు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమరాయునికొట్టాల (బీఆర్) గ్రామంలో శుక్రవారం విద్యుత్తు షాక్‌కు గురై వల్లెపు రాంబాబు (40) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... రాంబాబు తన ఇంటిలో సెల్ చార్జింగ్ పెట్టి.. పూర్తయిన తర్వాత తీసే సమయంలో ప్లగ్‌బాక్స్ పాతది కావడంతో చేతిలోకి రావడంతో విద్యుత్తు షాక్‌కు గురై పడిపోయాడు. కుటుంబసభ్యులు 108కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. సమాచారం తెలిసిన ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు రాంబాబు కూలి పనులు చేసుకుని జీవనం సాగించేవాడు. ఈయనకు భార్య రూపావతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేష్‌బాబు, ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

విద్యుత్‌తీగలు తగిలి రెండు గేదెలు...

వల్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని భాకరాపురం గ్రామంలో విద్యుత్ తీగలు తగులుకుని శుక్రవారం రెండు గేదెలు మృతి చెందినట్లు బాధిత రైతు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గురువారం రాత్రి కురిసిన గాలి వానకు భాకరాపురం గ్రామ సమీపంలోని పొలాల్లో విద్యుత్ లైన్లు తెగి నేల మీద పడ్డాయి. శుక్రవారం ఉదయం 10గంలకు సమయంలో గ్రామానికి చెందిన టి.నాగేశ్వర్‌రెడ్డి అనే రైతు తన గేదెలను మేపడానికి పొలాలకు తోలుకుని వెళ్లాడు. పొలంలో తెగి పడి ఉన్న విద్యుత్ తీగలు మొదట వెళుతున్న రెండు గేదెలకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. గేదెలు మృతి చెందడాన్ని గమనించిన రైతు అప్రమత్తమై మిగలిన గేదెలను పక్కకు తోలడంతో అవి సురక్షితంగా బయటపడ్డాయి. సుమారు ఒకటిన్నర లక్ష నష్టపోయినట్లు బాధిత రైతు తెలిపారు.

బోటు షికారుపై జిల్లా అధికారుల ఫిర్యాదు

జమ్మలమడుగు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గండికోటలో అనుమతిలేని బోటు షికారుపై శుక్రవారం రాత్రి 7.30 గంటలకు కడప టూరిజం డివిజన్ ఇన్‌చార్జి మల్లికార్జునగౌడ్, మరో అధికారి సీఐ నరేష్‌బాబును కలిసి ఫిర్యాదు చేశారు. ఇటీవల గండికోటలో అనుమతిలేని బోటు షికారుపై ఫిర్యాదు వెల్లువెత్తాయి. ఆంధ్ర జ్యోతి దిన పత్రికలో కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా అధికారులు జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో సీఐ నరేష్‌బాబును కలిసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ దిశగా సీఐ నరేష్‌బాబు గండికోటకు వెళ్లి పరిశీలిస్తామని తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భర్త గొడవ పడ్డాడని భార్యపై దాడి

మైదుకూరు అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భర్త గొడవ పడ్డాడన్న కక్షతో భార్యపై దాడి చేసిన ఘటన మైదుకూరులో జరిగింది. స్థానిక అరుంధతీనగర్‌కు చెందిన గద్దె రవి ఈనెల 11 తేదీ బచ్చనపల్లి పాలకొండయ్యతో గొడవ పడ్డాడు. ఈ కక్షతో 14వ తేదీ రవి భార్య సుజాతపై పాలకొండయ్యతో పాటు రాజేష్, పెద్ద ఓబులేసులతో కలిసి దాడి చేసి గాయపరిచారు. ఆమెను ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఈ మేరకు మైదుకూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

వేపచెట్టుకు నిప్పు..



వేప చెట్టు నుంచి ఎగిసి పడుతున్న పొగలు

కాశినాయన అక్టోబరు 17 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని ఉప్పలూరు గ్రామంలో పెద్దపీరయ్య స్వామి దర్గా లోపల ఉన్న వేపచెట్టు నుంచి శుక్రవారం దట్టమైన పొగలు బయటకు వ్యాపించాయి. దీంతో ఏం జరిగిందో తెలియక గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. అక్కడకు వెళ్లి పరిశీలించగా.. చెట్టు తొర్రలో నిప్పంటుకోవడంతో పొగలు వస్తున్నాయని గ్రహించారు. ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వాళ్ల వచ్చి మంటలను ఆర్పడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

నిబంధనలు పాటించకపోతే టపాసుల దుకాణాలు సీజ్

పులివెందుల రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో ఏర్పాటు చేసే టపాసుల దుకాణాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, నిబంధనలు పాటించని దుకాణాలను సీజ్ చేస్తామని పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో లాటరీ ద్వారా దుకాణాలను కేటాయింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ పులివెందుల పట్టణంలో 37 మంది టపాసుల విక్రయాలకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. లైసెన్స, విద్యుత్, ఫైర్, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల పరిశీలన అనంతరం 28 మంది అర్హులుగా తేలిందన్నారు. వీరికి టెంపరరీ లైసెన్స్ ఇచ్చి లాటరీ పద్ధతి ద్వారా దుకాణాల ఏర్పాటుకు నెంబర్లు కేటాయించామన్నారు.

చర్చలు విఫలమైతే సమ్మెకు సిద్ధం

- స్ట్రగుల్ కమిటీ నాయకులు
- ఆర్టీపీపీలో నల్లబ్యాడ్జీలతో నిరసన



ఆర్టీపీపీలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు, కార్మికులు

ఎర్రగుంట్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ యాజమాన్యాలతో జరుగుతున్న చర్చలు విఫలమైతే జేఏసీతో కలిసి సమ్మెకు సిద్ధమని విద్యుత్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నపూస సుబ్బిరెడ్డి, ఇతర నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన పిలుపుమేరకు శుక్రవారం ఆర్టీపీపీలో కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నల్లబ్యాడ్జీలతో మెయిన్ గేటు వద్ద ధర్నా చేశారు. కాంట్రాక్టు కార్మికుల ప్రధాన డిమాండ్ సంస్థలో విలీనం, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగుల పెండింగ్ డీఏలు, అన్ లిమిటెడ్ మెడికల్ పాలసీ విషయంలో మొండివైఖరి విడనాడాలని స్ట్రగుల్ కమిటీతో చర్చలు జరపాలన్నారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలన్నది న్యాయమైన చిరకాల కోరిక అన్నారు. థర్డ్ పార్టీ కాంట్రాక్టు వ్యవస్థను తొలగించి యాజమాన్యమే డైరెక్ట్‌గా కార్మికులకు వేతనాలు చెల్లించాలన్నారు. దీంతో ప్రైవేటు కాంట్రాక్టర్లకు చెల్లించే సూపర్ వైజర్ చార్జీలు, పన్నుల రూపంలో విద్యుత్ సంస్థలకు రూ.192కోట్లు ఆదా అవుతుందన్నారు. విద్యుత్ యాజమాన్యాలు ఆదిశగా ఆలోచించడం లేదన్నారు. తెలంగాణాలో విద్యుత్ కాంట్రాక్టు కార్మి కులను సంస్థలో విలీనం చేసుకుని పేస్కేల్స్ ఇస్తున్నారని, అక్కడలేని అభ్యంతరాలు న్యాయపరమైన చిక్కులు ఏపీలో మాత్రం ఎందుకొస్తాయని ప్రశ్నించారు. పీఆర్సీ అమలు చేయడంలో కూడా కాంట్రాక్టు కార్మికులకు భారీగా నష్టం జరుగుతోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, విద్యుత్ యాజమాన్యాలు కార్మికుల విషయంలో ఆలోచించి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో వెంకటస్వామి, హరిఓబుళరెడ్డి, వి.గంగయ్య, చంద్రశేఖర్, డి.పుల్లారెడ్డి, జేఆర్‌మోహన్,అబ్దుల్‌హమీద్, వెంకటరమణ, రాజు, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

కోతమిల్లుల నిర్వహణపై విజిలెన్స్



కోతమిల్లుల్లో పరిశీలన చేస్తున్న అటవీశాఖ విజిలెన్స్ అధికారులు

ప్రొద్దుటూరు రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులోని కోత మిల్లుల నిర్వహణ తీరుపై అటవీశాఖ విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. ఫారెస్టు విజిలెన్స్ డీఎఫ్ఐ ధర్మరక్షిత్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా కోత మిల్లులలో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం స్థానిక ఏకోపార్కులో జరుగుతున్న నగరవనం పనులను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలో స్వామిల్లులు నిర్వహిస్తున్నారని ఫిర్యాదులు అందడంతో వాటిని పరిశీలించారు. రిజర్వు ఫారెస్టుకు సమీపంలోస్వామిల్లులు ఉండకూడదన్నారు. మిల్లుల యజమానులతో మాట్లాడి లైసెన్సులు, ఇతర రికార్డులను పరిశీలించారు. అనుమతులు లేనివాటికి తగిన ఆదేశాలు జారీ చేసి లైసెన్సులు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో హేమాంజలి, తదితరులు పాల్గొన్నారు.

నూతన విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



సర్వజ్ఞ 2కె25 వర్క్‌షాప్‌లో విద్యార్థులు

పులివెందుల రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నూతన ఒరవడితో కూడిన విజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకొని భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలు పొందాలని జేఎన్టీయూ కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ అన్నారు. శుక్రవారం స్థానిక జేఎన్టీయూ కళాశాలలో సర్వజ్ఞ 2కె25 కార్యక్రమంలో భాగంగా ప్రాజెక్ట్ ఎక్స్‌పో, కోడింగ్ చాలెంజెస్ టెక్ మేమ్‌తో పాటు జనరేటివ్ ఏఐ మరియు ఫుల్‌స్టాక్ వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శేషమహేశ్వరమ్మ, కార్యక్రమ కన్వీనర్ మురళి, కోఆర్డినేటర్లు మహీంద్రరెడ్డి, ముని లావణ్య పాల్గొన్నారు.

డాక్టర్ శ్రీనితకు ఉత్తమ అవార్డు



వైవీయూ వీసీ బి.రాజశేఖర్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న శ్రీనిత

పులివెందుల రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీనిత ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అవార్డు అందుకున్నారు. యోగివేమన విశ్వవిద్యాలయంలో వైస్‌చాన్సలర్ బి.రాజశేఖర్ చేతులమీదుగా ప్రశంసాపత్రం, మెమెంటో అందించి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా డాక్టర్ శ్రీనిత మాట్లా డుతూ ఈ అవార్డుతో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. వైవీయూ రిజిస్ట్రార్ పి.పద్మ, వైవీయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ వెంకటరామిరెడ్డి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ బి.శ్రీనివాసులు, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం అభినందించారు.

ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదాం

రామాపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదామని ప్రజా చైతన్య సేవా సంఘం ప్రాజెక్టు మేనేజర్ విజయలక్ష్మి, సుహాసినీలు పిలుపునిచ్చారు. మండలంలోని ఆదర్శ పాఠశాలలో కస్తూర్బా పాఠశాలలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ప్రజాచైతన్య సేవా సంఘం ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసదస్సునుద్దేశించి వారు మాట్లాడుతూ అన్నిశాఖల అధికారులు విద్యార్థినీ, విద్యార్థులు ఎయిడ్స్ మహమ్మారి నివారణకు ప్రజలను చైతన్యవంతులను చేయాలని కోరారు. ప్రిన్సిపాల్ శ్యామలాదేవి, పుష్పలత, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బోద కొట్టం దగ్ధం

మైదుకూరు అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంజికుంట ఎస్సీ కాలనీలో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో బీంగాళ్ల చెండ్రాయుడుకు చెందిన బోదకొట్టం దగ్ధం అయ్యింది. భయంతో కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీసి మైదుకూరు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఫైర్ అధికారులు వచ్చి మంటలను ఆర్పారు. ప్రమాదంలో ఇంటిలోని సామగ్రి కాలిపోయిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

ఉల్లి పంట దున్నేశారు..



ఉల్లి పంటను రోటోవేటర్‌తో దున్నేస్తున్న రైతు

ముద్దనూరు అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కోతకు వచ్చిన ఉల్లి పంటకు గిట్టుబాటు ధర లేక పోవడంతో రైతులు పంటను పొలంలోనే పశువులకు, గొర్రెలకు వదిలేస్తున్నారు. చింతకుంట గ్రామంలో ఓ రైతు శుక్రవారం పంటను రోటోవేటర్‌తో దున్నేశాడు. వివరాల్లోకి వెళితే... మండలంలో దాదాపు 950 ఎకరాల్లో ఉల్లి పంటసాగు చేశారు. పంట చేతి కొచ్చిన సమయంలో గిట్టుబాటు ధర లేదు. క్వింటా రూ.400 మాత్రమే ధర పలుకుతోంది. ఇక కోత సమయంలో వర్షాలు పడుతుండటంతో రైతుల్లో ఆశలు సన్నగిల్లాయి. కూలీల ఖర్చులు కూడా రావని చాలా మంది రైతులు పంటను పొలంలోనే పశువులకు వదిలేశారు. ఈ నేపధ్యంలో చింతకుంట గ్రామానికి చెందిన నాగిరెడ్డి అనే రైతు 5 ఎకరాల్లో సాగు చేసిన ఉల్లి పంటను రోటోవేటర్‌తో దున్నివేశాడు. పంటసాగుకు ఎకరాకు దాదాపు రూ.40వేలు ఖర్చు అయ్యిందన్నారు. ప్రభుత్వం నష్టపోయిన ఉల్లి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. కాగా, ఉల్లికి గిట్టుబాటు ధర లేదని ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్లామని, ఈ క్రాప్ చేసుకున్న రైతులకు హెక్టారుకు రూ.50వేలు ఇన్‌పుట్ సబ్సిడీ వచ్చే అవకాశం ఉందని ముద్దనూరు ఉద్యానశాఖాధికారి మల్లేశ్వరరెడ్డి తెలిపారు.

మహిళ మృతికి కారణమైన క్లినిక్ సీజ్




సీజ్ చేసిన ఎంవీఆర్ మెడికల్ స్టోర్ క్లీనికల్ ల్యాబ్

మైదుకూరు అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు పట్టణంలో అనుమతులు లేకుండా మెడికల్ స్టోర్‌లో క్లినిక్‌ను నిర్వహిస్తూ మహిళ మృతికి కారణమైన ఎంవీఆర్ ఆర్ఎంపీ కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సీజ్ చేశారు. శుక్రవారం జిల్లా వైద్యాధికారి భారతి ఆర్ఎంపీ కేంద్రంలో తనిఖీలు చేపట్టి చర్యలు చేపట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా చాలా మంది మందుల దుకాణాలలో ఆర్ఎంపీ కేంద్రాలను ఏర్పాటు చేసుకొని వైద్యం చేస్తున్నారన్నారు. అటువంటి మెడికల్ స్టోర్లు, క్లీనిక్‌లు, క్లీనికల్‌ల్యాబ్‌లు, ఆర్ఎంపీ కేంద్రాలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మెడికల్ స్టోర్‌లను యజ మానులు కాకుండా ఇతర వ్యక్తులు నిర్వహిస్తే డ్రగ్ నియంత్రణ అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. అనుమతులు ఉన్న ప్రైవేటు ఆసుపత్రులలో ఎంబీబీఎస్ అర్హత ఉన్న డాక్టర్లు అఫిడవిట్ ద్వారా సూచించిన సమయంలో వైద్యం అందించవచ్చని తెలిపారు. ప్రజలు అర్హత ఉన్న వైద్యుల వద్ద, ప్రభుత్వ ఆసుపత్రులలో మాత్రమే చికిత్స చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ మల్లేష్, మెడికల్ ఆఫీసర్ అయేషా, జిల్లా అధికారులు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

7న జిల్లాలో హాకీ ఉత్సవాలు

కడప స్పోర్ట్స్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో హాకీ ఇండియా అసోసియేషన్ స్థాపించి వందేళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా.. హాకీ ఇండియా శత జయంతి ఉత్సవాలను నవంబరు 7న జిల్లాలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా హాకీ సంఘం అధ్యక్షుడు జె.రవి, కార్యదర్శి శేఖర్ తెలిపారు. శుక్రవారం స్థానిక డీఎస్ఏ స్టేడియంలో కడప హాకీ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. శత జయంతి ఉత్సవాలు భారతదేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారని, అందులో భాగంగా ఏపీ రాష్ట్ర హాకీ అసోసియేషన్ ఆదేశాల మేరకు నవంబరు 7న జిల్లాలో ఉత్సవాలు ఘనంగా జరిపేందుకు తీర్మానించామన్నారు. ఈ మేరకు పురుషులు, మహిళలకు హాకీ పోటీలు నిర్వహిస్తామని, సీనియర్ క్రీడాకారులకు సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.



సెక్యూరిటీ గార్డ్ కావలెను

కడపజిల్లాలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. Q : 5th - 10th P / Fail డ్యూటీ: 12గంటలకు, జీతం: 12,000/- సంప్ర : 97035 08754, 70950 04007

Ajc-249506

KK ENTERPRISES

ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు Female టెలి కాలర్స్ కావలెను. అడ్రస్ : కడప. సంప్రదించగలరు సెల్ : 86399 23418

Ajc-249578

పాసుపోర్టు పోయినది

రెడ్డి మని శివకుమార్ తండ్రి రెడ్డి మని వెంకటస్వామి, D.No. 2/52, టంగుటూరు గ్రామం, నందలూరు మండలం, అన్నమయ్యజిల్లా, ఆంధ్రప్రదేశ్, పాసుపోర్టు నెం.W7988814, 10/09/2025వతేది టంగుటూరు నుంచి రాజంపేటకు ఆటోలో వెళుతుండగా పోయినది. దొరికినవారు అందజేయగలరు.

Ajc-000

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.

AJA- 246955

CHANGE OF NAME

SHAIK RAZIA BANU (OLD NAME) W/o. SHAIK MOHAMMED FAZIL, D.NO.48/198, RAVINDRA NAGAR, KADAPA, YSR KADAPA DIST., A. P - 516003. Do hereby change my name to SHAIK RAZIYA BANU (New Name), Hence forth then now I may be called as SHAIK RAZIYA BANU.

AJC-000

CHANGE OF NAME

MAHAMMED FAZIL (OLD NAME) S/o. MOHAMMED HAZAM, D.NO.48/198, RAVINDRA NAGAR, KADAPA, YSR KADAPA DIST., A. P - 516003. Do hereby change my name to SHAIK MOHAMMED FAZIL (New Name), Hence forth then now I may be called as SHAIK MOHAMMED FAZIL.

AJC-000

ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

చిత్రజ్యోతి
SINCE 1965

పంచాయతీ సెక్రటరీ



వింటేజ్ కపుల్ శివాజీ, లయ మరోసారి కలసి నటిస్తున్న చిత్రం నిర్మాణదశలో ఉంది. ఈటీవీ విన్‌తో కలసి శివాజీ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆయన పంచాయతీ సెక్రటరీ శ్రీరామ్‌గా నటిస్తున్నారు. దీపావళి పండగ సందర్భంగా ఈ చిత్రం నుంచి శివాజీ లుక్ విడుదల చేశారు. తన కుటుంబంతో కలసి దీపావళి పండగ సెలబ్రేట్ చేసుకోవడానికి పటాసులు తీసుకెళుతున్న లుక్ అది. అన్యాయాన్ని సహించని వ్యక్తిగా, నిజాయతీపరుడిగా శివాజీ ఇందులో నటిస్తున్నారు. భార్యాబిడ్డలే అతని ప్రపంచం, వాళ్ల కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా వెనుకాడని వ్యక్తి పాత్రలో శివాజీ అభినయం ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు సుధీర్ శ్రీరామ్ చెప్పారు. చిత్రం టైటిల్, ఇతర విశేషాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. అలీ, ధనరాజ్, ప్రిన్స్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

వంద శాతం హిట్ కొడతాం

సుధీర్ బాబు



సుధీర్ బాబు ప్రధాన పాత్రధారునిగా దర్శకద్వయం వెంకటేశ్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'జటాధర'. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది. తాజాగా ప్రిన్స్ మహేశ్‌బాబు సోషల్ మీడియా వేదికగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్‌లో భూత పిశాచాలు, శాపగ్రస్త ఆలయాలు, ఆధ్యాత్మిక యుద్ధాలను కళ్లు తిప్పుకోలేని విధంగా చూపించారు. సుధీర్ బాబు నేలపై ఉన్న రక్తం తాగుతూ తపస్సులోకి వెళ్లే సన్నివేశం ఒళ్లు జలదరింపజేస్తుంది. భయానక సన్నివేశాలతో పాటు భారతీయ పురాణ వైభవాన్ని కూడా అద్భుతంగా తెరకెక్కించారు. అనంతరం నిర్వహించిన వేడుకలో హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ 'ఈ సినిమాలో అద్భుతమైన కథ ఉంది. అంతకు మించిన భావోద్వేగాలుంటాయి. ధన పిశాచి పాత్రలో సోనాక్షి సిన్హా అదరగొట్టారు. ప్రేక్షకుల డబ్బులకు విలువ ఇచ్చినప్పుడు సినిమా వంద శాతం విజయం సాధిస్తుంది. 'జటాధర' కూడా వంద శాతం హిట్ కొడుతుంది. నవంబరు 7న కుటుంబ సభ్యులందర్నీ సినిమాకు తీసుకెళ్లండి' అని అన్నారు. నటి శిల్పా శిరోద్కర్ మాట్లాడుతూ 'చాలా రోజుల తర్వాత 'జటాధర'తో తెలుగులో నటించడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

విజయం సాధించాం

సిద్ధు జొన్నలగడ్డ



"తెలుసు కదా' సినిమా చేయాలని అనుకున్నప్పుడు నా మనసులో ఒక భయం ఉండేది. ఆ భయం యాక్టర్‌గా కాదు రైటర్‌గా. ప్రతీ సన్నివేశంలో పంచులు లేకుండా ప్రేక్షకుల్ని మెప్పించగలమా అనే సందేహం ఉండేది. ఈ రోజు ఆ భయం పోయింది. థియేటర్ల ఎదుట హౌస్‌ఫుల్ బోర్డులు చూస్తుంటే మేము విజయం సాధించామనే ఆనందం కలిగింది. సినిమాకు అన్ని చోట్ల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఆయన కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కించిన చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రెస్ మీట్ నిర్వహించింది. చిత్ర దర్శకురాలు నీరజ కోన మాట్లాడుతూ 'సినిమాకు వస్తున్న స్పందనను చూస్తుంటే చాలా ఎమోషనల్‌గా ఉంది. చిత్ర కథలో మేము కనెక్ట్ అయిన పాయింట్‌తో ప్రేక్షకులు కూడా అంతే అద్భుతంగా కనెక్ట్ అయ్యారు. మా నిర్మాతలు విశ్వ గారు, కృతి గారు, హీరో సిద్ధు, హీరోయిన్లు రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి, చిత్ర బృందం మొత్తానికి కృతజ్ఞతలు' అని అన్నారు. నటుడు వైవా హర్ష మాట్లాడుతూ 'మా చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని చెప్పారు.

సందేశాత్మకం

జాతీయ అవార్డు గ్రహీత నరసింహ నంది దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. దైవ నరేశ్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మిస్తున్నారు. చిత్రబృందం ఇటీవలే టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'మా సినిమా ప్రచార చిత్రాలకు చక్కని స్పందన వచ్చింది. కథానుసారం తెలంగాణ యాసలో కొన్ని పాత్రలు పలికిన సంభాషణలను కొందరు విమర్శించారు, కానీ సినిమా ఎవరినీ కించపరిచేలా ఉండదు. సందేశాత్మకంగా ఉంటుంది' అని చెప్పారు. త్వరలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని దర్శకుడు తెలిపారు.





అనుబంధాలను ఆవిష్కరించే చిత్రం

'నేను నటించే సినిమాలు చాలా బావుంటాయి అనే ఇమేజ్‌ను ప్రేక్షకుల దగ్గర తెచ్చుకోవాలనేదే నా ప్రయత్నం. అది 'కె-ర్యాంప్' చిత్రంతో పూర్తిగా నెరవేరుతుందనే నమ్మకం ఉంది. కుటుంబ అనుబంధాలను తెరపై గొప్పగా ఆవిష్కరించే చిత్రమిది' అని కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన కథానాయకుడిగా జైన్స్ నాని దర్శకత్వం వహించిన చిత్రం 'కె-ర్యాంప్'. రాజేశ్ దండా, శివ బొమ్మక్ నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. జైన్స్ నాని మాట్లాడుతూ 'మా సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే ప్రచార చిత్రాలతో మంచి ఆసక్తి ఏర్పడింది. ఈ సినిమాలో డైలాగ్స్ ప్రేక్షకులకు బాగా నచ్చాయి. వాటిని ప్రేక్షకులు చెబుతుంటే చాలా సంతోషంగా అనిపించింది. ప్రథమార్థంలో ప్రేమకథా, ద్వితీయార్థంలో కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.





వ్యాసరచనలో విద్యార్థిని ప్రతిభ

● అభినందించిన కలెక్టర్ నిశాంత్‌కుమార్



నవ్యలతకు బహుమతిని అందజేస్తున్న కలెక్టర్

సుండుపల్లె, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బాలికల హక్కులను కాపాడటం, గర్భాశయ నిషేధ చట్టంపై జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో సుండుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని నవ్యలతకు మొదటి బహుమతి వచ్చినట్లు మండల విద్యాశాఖ అధికారులు వెంకటేశ్‌నాయక్, రవీంద్రనాయక్‌లు తెలిపారు. ఈ సందర్భంగా మొదటి బహుమతి వచ్చిన విద్యార్థినికి కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రోత్సాహక బహుమతిని అందజేసి అభినందించారు. అనంతరం మండలంలోని ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థుల ఆవశ్యకతను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

హౌసింగ్ అధికారులపై చర్యలకు సిద్ధం

● నోటీసులు జారీ చేసిన ప్రభుత్వం

కలికిరి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా హౌసింగ్ శాఖలో ప్రస్తుతం సస్పెన్షన్‌లో వున్న ఇద్దరు అధికారలపై తుది చర్యలు తీసుకొనేందుకు ప్రభుత్వం సమాయత్తమైంది. ఇందు కనువుగా వారిద్దరిపై నమోదైన అభియోగాలు స్పష్టమైన సాక్ష్యాధారాలతో రుజువైన నేపథ్యంలో తదుపరి చర్యల కోసం ఇరువురికీ శుక్రవారం ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి హౌసింగ్ అధికారిగా వున్న ఎక్జిక్యూటివ్ ఇంజినీరు బి.సాంబశివయ్య, పీలేరు ఇన్‌చార్జి ఈఈగా వున్న రాయచోటి డీఈఈ బుక్యా గోపాల్ నాయక్‌లను పలు ఆరోపణలపై జూలై 14న ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికీ ఈ ఇద్దరూ సస్పెన్షన్‌లో వున్న నేపథ్యంలో తాజాగా ఇరువురిపై నమోదైన అభియోగాల్లో సాక్ష్యాధారాలున్న కారణంగా తదుపరి చర్యలు తీసుకునేందుకు రుజువులను వారి ముందుంచుతూ నోటీసులు జారీ చేసింది. డీఈఈ గోపాల్ నాయక్ తన కింద పనిచేసే ఎ.శ్రీహరి నుంచి రూ.21 వేలు ఫోన్ పే ద్వారా లంచం తీసుకున్నాడని రుజువైంది. అదే విధంగా శ్రీహరి నుంచి మరో రూ.50 లంచంగా తన కంప్యూటర్ ఆపరేటర్ ఫోన్ పే ద్వారా ఈఈ సాంబశివయ్య తీసుకున్నాడనేది రుజువైందని నోటీసులో పేర్కొన్నారు. ఏసీబీ అధికారులు క్షుణ్ణంగా దర్యాప్తు చేసిన అనంతరం పలు సాక్ష్యాధారాలను సేకరించారు. మొత్తం మీద ఈ ఇరువురిపై నమోదైన అవినీతి వ్యవహారాల్లో సాక్షులుగా వర్క్ ఇన్‌స్పెక్టర్ అనగాని శ్రీహరి, ఔట్ సోర్సింగ్ ఏఈ ముద్దన రామమోహన్, రాయచోటి డీఈఈ పూల చంద్రశేఖర్, సుండుపల్లె ఇంజినీరింగ్ అసిస్టెంట్ బి.చంద్రశేఖర్ నాయక్‌లు ప్రధాన సాక్షులుగా నిలిచారని నోటీసులో పేర్కొన్నారు. దీనిపై ఇరువురూ 10 రోజుల్లోగా వివరణలు పంపుకోవాలని ఆదేశించారు. ఆ తరువాత తీసుకోబోయే చర్యలను నిర్ణయించనున్నారు. ఈ మేరకు గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ శుక్రవారం ఇరువురికీ వేర్వేరు నోటీసులు జారీ చేశారు.

ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లకు జైలు శిక్ష

● ఐదేళ్లు కఠిన కారాగార శిక్ష.. ఒక్కొక్కరికి రూ.3లక్షల జరిమానా

● ములకలచెరువు కేసులో తిరుపతి జిల్లా కోర్టు తీర్పు



శిక్షపడ్డ నిందితులతో ములకలచెరువు పోలీసులు

ములకలచెరువు, అక్టోబరు 17 (ఆంధ్ర జ్యోతి): ములకలచెరువు మండలంలో పట్టుబడ్డ ఎర్రచందనం కేసులో నిందితులైన ఇద్దరిపై నేరం రుజువు కావడంతో శుక్రవారం జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ తిరుపతి ఆర్‌ఎస్‌ఎస్ ఏడీజే కోర్టు కీలక తీర్పు వెలువరించింది. 2019లో ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లాకు చెందిన నారాయణప్ప శివకుమార్(27), సుబ్రమణ్యం మంజునాథ్(27)లను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించి తిరుపతి జిల్లా ఆర్‌ఎస్‌ఎస్ ఏడీజే కోర్టులో వాదనలు జరిగాయి. ఇద్దరిపై నేరం రుజువు కావడంతో ఒకొక్కరికి ఐదేళ్ల పాటు కఠిన కారాగార శిక్ష, రూ.3లక్షల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా ఆరు నెలలు జైలు శిక్ష ఉంటుందని తీర్పునిచ్చారు. ఎర్రచందనం పట్టుకోవడంతో పాటు కేసు విచారణ, పర్యవేక్షణ, కోర్టు లైజనింగ్‌లో అద్భుత కృషి చేసిన డీఎస్పీ మహేంద్ర, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు రామకృష్ణ, నరసింహుడు, హెడ్‌కానిస్టేబుల్ గణేష్‌లను ఎస్పీ అభినందించారు.

రైల్వేకోడూరులో కంచి పీఠాధిపతి



భక్తులకు ఆశీర్వాదం ఇస్తున్న పీఠాధిపతి

రైల్వేకోడూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరపురాజుపల్లెలో కోదండరామాలయ సంప్రోక్షణ, మహా కుంభాభిషేకం కార్యక్రమంలో పాల్గొనేందుకు కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్రసరస్వతి గురువారం సాయంత్రం సూరపురాజుపల్లెకు చేరుకున్నారు. రాత్రి సూరపురాజు శివరామరాజు ఇంట్లో బస చేశారు శుక్రవారం ఆయన కోదండరామాలయ మహా కుంభాభిషేకం పూజలు, హోమాలు నిర్వహించారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, రైతుల పాడిపంటలు అభివృద్ధి చెందాలని, భక్తులకు దీవెనలు ఇచ్చారు. ప్రతి ఒక్కరిలోనూ ఆధ్యాత్మిక చింతన ఉంటే భక్తిభావం పెరుగుతుందన్నారు. ఈ పూజల్లో కళ్యాణ్ దాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సైన్స్ సెమినార్లు ఉపయోగకరం


● జిల్లా ఉప విద్యాశాఖ అధికారి నాగయ్య



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్రీయ పోకడలపై అవగాహన పెంపొందించేందుకు సైన్స్ సెమినార్లు ఎంతగానో ఉపయోగపడతాయని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి లంకయ్యగారి నాగయ్య తెలిపారు. శుక్రవారం పట్టణంలోని డైట్ కళాశాలలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఉప విద్యాశాఖ అధికారి నాగయ్య మాట్లాడుతూ క్వాంటం యుగం ప్రారంభం, బలాలు, బలహీనతలు అను అంశాన్ని విద్యార్థులు చక్కగా అవగాహన చేసుకుని సెమినార్‌లో వివరించారన్నారు. ఇలాంటి సెమినార్లు విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచనలను, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందిస్తాయన్నారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం, భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖ సహకారంతో ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ ఆదేశాలతో జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించామన్నారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి పాల్గొన్న విద్యార్థులను ప్రజెంటేషన్, వైవా, ఆప్టిట్యూడ్ టెస్ట్ ద్వారా పరీక్షించగా సంబేపల్లె మోడల్ స్కూల్‌కు చెందిన బొజ్జ శ్రీవిశ్వనందరెడ్డి మొదటి స్థానంలోనూ, వాల్మీకిపురం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని షాహిన్‌తాజ్ ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. వీరు శనివారం విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సెమినార్‌లో పాల్గొంటారన్నారు. ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు కరుణాకర్, రెడ్డెయ్య న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారన్నారు. ఈ కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు, డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మడితాటి నరసింహా రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, ఆప్ కాస్ట్ కోఆర్డినేటర్ రవిశంకర్‌రెడ్డి, ఎన్జీసీ కోఆర్డి నేటర్ శివలక్ష్మి, రీసోర్స్‌పర్సన్ రంజిత్, హేమంత్ కుమార్, గైడ్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయండి : జడ్పీ సీఈవో



మాట్లాడుతున్న జడ్పీసీఈవో రవికుమార్ నాయుడు

పెద్దమండ్యం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కోసం సమష్టిగా, బాధ్యతాయుతంగా పనిచేయాలని చిత్తూరు జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన పెద్దమండ్యం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన పెద్దమండ్యంలోని జడ్పీ హైస్కూల్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయిన ప్రహరీ గోడలను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పలు అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి పనులకు మంజూరైన నిధులను సకాలంలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. వర్షాల ధాటికి దెబ్బతిన్న చెరువులు, రోడ్లకు సంబంధించిన నివేదికలను సిద్ధం చేయాలన్నారు. అలాగే మండలానికి కావాల్సిన అభివృద్ధి పనుల ప్రణాళికలు కూడా పంపించాలన్నారు. తర్వాత కూటమి నేతలతో మాట్లాడారు. గ్రామాల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఏపీవో సురేంద్ర, ఏపీఎం నరసింహులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కలకడ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బాలయ్యగారిపల్లె పంచాయతీ పరిధిలోని ఝరికోన నీటిలో వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు హెడ్‌కానిస్టేబుల్ ముజీబ్‌అహ్మద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మృతి చెందిన వ్యక్తి వయస్సు 45సంవత్సరాలు ఉంటుందని, మృతి చెంది రెండు రోజులకుపైగా కావడంతో ఆనవాళ్లు లభ్యం కాలేదన్నారు. మృతుడు ఫుల్ హ్యాండ్స్ లైట్ గ్రీన్, పసుపు రంగు చొక్కా ధరించినట్లు తెలిపారు. దురదృష్టవశాత్తు కాలు జారి నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడా...?లేక మరేదైనా ప్రమాదంలో మృతి చెందాడా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

నిందితుడిపై పోక్సో కేసు

గాలివీడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బాలిక గోపిక మృతికి కారకుడైన శీలం దేవేంద్రపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ప్రేమ పేరుతో బాలికకు మాయమాటలు చెప్పి, వివిధ రకాలుగా వేధింపులకు గురి చేసి ఆత్మహత్య చేసుకునే విధంగా ప్రేరేపించిన దేవేందర్‌పై పోక్సోతో పాటు, పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిందితుడు కోర్టులో లొంగిపోయి జైల్లో ఉన్నాడని త్వరలో కేసు విచారణ నిమిత్తం కస్టడీలోకి తీసుకోవడానికి కోర్టులో పిటిషన్ వేశామని తెలిపారు.

లారీలు ఢీ : నలుగురికి తీవ్రగాయాలు



ఢీకొని దెబ్బతిన్న లారీలు

ములకలచెరువు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ముంబై-చెన్నై జాతీయ రహదారిలోని పెద్దపాళ్యం ఫ్లైఓవర్‌పై శుక్రవారం తెల్లవారుజామున రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని పెద్దపాళ్యం వద్దనున్న ఫ్లైఓవర్‌పై టమోటా క్రేట్లు తీసుకొస్తున్న లారీ, ఐరన్‌లోడుతో వెళ్తున్న మరో లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పులిచెర్ల, తమిళనాడు రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్లు మురళీకృష్ణ, రామ్మూర్తితో పాటు మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి గాయపడిన వారిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

WANTED

కడపజిల్లా యందలి 220 KV సబ్‌స్టేషన్‌లో తాత్కాలికముగా పనిచేయుటకు Diploma / B.Tech. ఎలక్ట్రికల్ మరియు ITI కలిగిన ఆసక్తి కలవారు సంప్రదించగలరు.

Cell No.: 9490183662 73968 82377

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram Finance Ltd Kadapa Branch-1 issues the following notice to the general public. My client intend to grant loan to **Sri Boggula Obula Reddy S/o Chinna Obula Reddy** R/o D.No. 26/917-2, Guruvaiah Thota Street, Proddatur Town, Kadapa City, YSR Kadapa Dist by mortgaing the below schedule mentioned property as security by way of Registered mortgaged. And As such if anyone has any claims, objections charges or mortgages sale agreements, court attachments court disputes etc, shall be informed to the address mentioned below in within 7 days from the date of this notice, otherwise matter objections will not bind on my client not bind on my client in the regard, **SCHEDULE OF THE PROPERTY**: **Item No.1, Sy. No. :** Survey No. 129-1A **Extent Area (in acres / hec. Sq.Yds,/ Sq.ft.)** 924 Sq. yards **Location (Address) :** Residential Vacant site Plot No. 103, YSR District, Proddatur Registration District, Proddatur Mandal, Chowtapalli Panchayat, Bollavaram (V) in Sy.No.129-1a to an extent of 924 Sq. Yards **Boundaries ; Item No.1:** East : 30 Feet width joint Rastha, West : Land of Narala Subba reddy, North : Vacant Site in Plot No. 104, South : Plot Site in Plot No. 102. **Item No.2:** Sy. No. : Survey No. 129-1A, **Extent Area (in acres / hec. Sq.Yds,/ Sq.ft.)** 924 Sq. yards **Location (Address)** : Residential Vacant site Plot No. 104, YSR District, Proddatur Registration District, Proddatur Mandal, Chowtapalli Panchayat, Bollavaram (V) in Sy.No.129-1a to an extent of 924 Sq. Yards **Boundaries ; Item No.2**: East : 30 Feet width joint Rastha, West :Land of Narala Subba reddy, North : Vacant Site in Plot No. 105, South : Plot Site in Plot No. 103.

Yours faithfully
SHAIK KHAJA MOHIDDIN
M.A. M.Phil. BL., Advocate & Notary

SAI RAJESWARI INSTITUTE OF TECHNOLOGY
(Autonomous)
Approved by AICTE Affiliated to JNTUA Approved by SBTET
An ISO 9001:2015 Certified Institution Recognized by UGC under section 2(f) of UGC Act 1956
Accredited by NAAC with "B+" Grade Accredited by NBA-B. Tech. Programmed CE, EEE,ECE & CSE

EAPCET/ECET/ICET Code: SRIP

I B.Tech. Category - B Seats Admissions: 2025-26

Admission into B.Tech 1st year under Category "B" seats for 2025-26. Application form for Admission into B.Tech 1st year in the following courses under category 'B' seats for the academic year 2025-26 can obtained from the college office.

Vacancy Position (Category - B)

Courses	CIVIL	EEE	MEC	ECE	CSE	CSE (AI & ML)
Intake	30	60	30	180	360	120
Category - B seats	9	18	9	54	108	36

Filled in applications along with copies of relevant certificates, documents etc., and registration fee of Rs. 1,000/- (APEAPCET-2025 qualified) and Rs. 1,200/- (APEAPCET-2025 not qualified) may be submitted in person in the college on any working day between 09:00am to 04:00pm or sent by post so as to reach on or before 23-10-2025. The admission will be as per the orders of the Government of Andhra Pradesh and the guidelines by the competent Authority.

For Further Details, Contact: 9121244591-593 PRINCIPAL







బ్రిడ్జి రాదు.. కష్టాలు తీరవు

పోరుమామిళ్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దంవారిపల్లె గ్రామానికి బ్రిడ్జి రాదు.. ప్రజలకు కష్టాలు తీరవు. ఇలా ఎన్ని రోజులు మా ఇబ్బందులంటూ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో బ్రిడ్జి నిర్మాణానికి కోటి రూపాయలు నిధులు మంజూరయ్యాయి. కానీ బిల్లులు అందకపోవడంతో కాంట్రాక్టర్లు మధ్యలోనే చేతులెత్తేశారు. దీంతో ఆ గ్రామస్థులు వర్షం వచ్చినప్పుడు, వాగులు పారినప్పుడు ఊరి నుంచి బయటికి వెళ్లాలన్నా బయటి నుంచి ఊరిలోకి రావాలన్నా ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. మాకు బ్రిడ్జి రాదు.. కష్టాలు తీరవని ప్రజలు వాపోతున్నారు. ఇదిలా ఉండగా పాత బ్రిడ్జి పూర్తిగా దెబ్బతినడంతో నీళ్లల్లోనే నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాదాపు 50 కుటుంబాల వారు నివాసం ఉంటున్న ఈ గ్రామంలోని ప్రజలు తారురోడ్డు మీదకి రావాలంటే పాత బ్రిడ్జిని దాటుకునే రావాల్సిన పరిస్థితి. ఇటీవల కురిసిన వర్షానికి వంకలు పారుతుండడంతో నీరు పాత బ్రిడ్జిపై ఉధృతంగా ప్రవహిస్తుండ డంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, అధికారులు, నాయకులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేయాలని గామస్థులు కోరుతున్నారు.

ఏఈ ఏమన్నారంటే: కాగా బ్రిడ్జి విషయంపై పీఆర్ ఏఈ సుబ్రమణ్యంను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా పాత బ్రిడ్జితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నది వాస్తవమేనన్నారు. ఇందుకు సంబంధించిన పనులు త్వరలో ప్రారంభమవుతాయని ఏఈ తెలిపారు.


గ్రామానికి నీటిలోనే నడిచి వెళుతున్న, గ్రామస్థులు

సంక్షేమ పథకాలలో అధికారుల పాత్ర కీలకం

కొండాపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల అమలులో అధికారుల పాత్ర కీలకమని ఎంపీడీవో నాగప్రసాద్ సూచించారు. ఎంపీపీ లక్ష్మీదేవి అధ్యక్షతన స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ వల్ల ప్రజలకు ఎంతో ప్రయోజ నం చేకూరనుందన్నారు. ఈనెల 25 లోపు రైతులు ఈ క్రాప్ చేయించుకోవాలని ఏవో తెలిపారు. కొత్త ఉపాధ్యాయుల రాకతో పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేదని ఏంఈవో రామయ్య తెలిపారు.

జ్యోతి ఫుడ్స్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడులు పెట్టించుకుని మోసం చేసిన జ్యోతి ఫుడ్స్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు లక్ష్మీ, శ్రీనివాసరావు, శంకరయ్యలు పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పెద్దజక్కన్న యూట్యూబ్‌లో జ్యోతి ఫుడ్స్ పేరుతో రూ.10 వేలు పెట్టుబడి పెడితే నెలకు రూ.2,300 వడ్డీ చెల్లిస్తామని ప్రకటించడంతో లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టామని, ఆ తర్వాత అతను కనిపించకుండాపోయాడన్నారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని, రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పంటలు నీట మునుగుతున్నా పట్టించుకోరా..?

మైదుకూరు రూరల్,అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) : పంటలు నీట మునుగుతున్నా అధికారులు పట్టించుకోరా అంటు రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఏవి రమణ మండిపడ్డారు. మండలంలోని పప్పనపల్లె పంచాయతీలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ,అరటి, పసుపు, ఉల్లి పంట పొలాల్లో నీరు నిలబడి నాశనమౌతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. దీనిపై రమణ పంటలను పరిశీలించి పంట కాలు వలు తీయించి రైతులను ఆదుకో వాలని కోరారు.

ఆరోగ్యంపై అవగాహన

మైదుకూరు అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలొ మైదుకూరు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం,వనిపెంట గురుకుల పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నాగరాజు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా చేతులను కడుక్కోవడం వలన కలిగే ప్రయోజనాలను తెలియజేశారు.

వైద్య ఖర్చులు తీర్చుతున్న సీఎం సహాయ నిధి

ప్రొద్దుటూరు , అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల వైద్య అవసరాలకు అయ్యే ఖర్చులను సీఎం సహాయ నిధి ద్వారా తీరుతున్నాయని ఎమ్మెల్యే నంద్యాల వరద రాజులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో వైద్యం చేయించుకొన్న రోగులకు సీఎం సహాయనిధి ద్వారా వచ్చిన రూ.45.05 లక్షల విలువ చేసే 22 చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారినా సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం రూ 13 వేల కోట్ల మేర అభివృద్ధి ప్రాజెక్టులు కేంద్ర ప్రభుత్వ సహకారంతో తీసుకురాబోతున్నారన్నారు. దక్షిణాది రాష్ట్రాలలోనే మంత్రి నారా లోకేశ్ చొరవతో గూగుల్ సంస్థ విశాఖపట్నంకు రావడం ఎంతో ప్రతిష్టాత్మకమన్నారు.మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య మాట్లాడుతూ కూటమిప్రభుత్వం వచ్చాక రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందతోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్లు బద్వేలు శ్రీనివాసులరెడ్డి ,అమీర్ బాషా, తలారి పుల్లయ్య, కౌన్సిలర్ కమాల్ బాషా, వద్ది ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.


సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

గురుకుల విద్యార్థులకు కంటి పరీక్షలు

బి.కోడూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సగిలేరు గురుకుల పాఠశాలలో శుక్రవారం బి.కోడూరు ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో కంటి వైద్యాధికారి హుసేనయ్య 207 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 22 మందికి దృష్టి లోపం ఉన్న వారిని గుర్తించి వారికి కంటి అద్దాల మంజూరుకు ఉన్నతాధికారులకు పంపించారు. అనంతరం హెల్త్ సూపర్‌వైజరు జాన్‌విలియం గుండె ప్రధమ చికిత్సలు ఎలా చేసుకోవాలనేది విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చెన్నయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మానం

కలసపాడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ బదిలీ అయిన సి.వెంకటరెడ్డి, కె.వెంకట సుబ్బారెడ్డి అనే ఉపాధ్యాయులను శుక్రవారం గ్రామస్థులు, ఉపాధ్యాయులు శాలువ పూలమాలలతో ఘనంగా సన్మానించారు. విద్యాబోధనలో వారు చేసిన కృషి మరువలేమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మస్తాన్‌వలి, ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ కరిముల్లా, ఏపీ టూరిజం శాఖ మాజీ డైరెక్టర్ పోకల రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సావిశెట్టిపల్లె పంచాయతీ సెక్రటరీ బదిలీ

కాశినాయన అక్టోబరు17(ఆంధ్రజ్యోతి)మండలంలోని సావిశెట్టిపల్లె పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్న గురు ప్రసాద్ పోరుమామిళ్ల మండలంలోని తిమ్మారెడ్డిపల్లె గ్రామసచివాలయానికి బదిలీపై వెళ్లారు. ఈమేరకు శుక్రవారం రిలీవ్ అయిన గురుప్రసాద్‌ను స్థానిక సర్పంచ్ వరప్రసాద్ అధ్యక్షతన గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్‌లు సహచర ఉద్యోగులు గ్రామస్థులు పాల్గొన్నారు.

పంచాయతీలు ఆదాయ వనరులను పెంచుకోవాలి

చాపాడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు వాటి పరిధిలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ఎంపీడీవో వీరకిశోర్, బోధకుడు సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం అధికారులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమాలు రెండు రోజులపాటు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు,పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో: మండలంలోని గ్రామ పంచాయాతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు శుక్రవారం స్త్రీశక్తి భవనంలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి ఎంపీడీవో ఉపేందర్‌రెడ్డి హాజరై పంచాయతీలు సొంత ఆదాయ వనరులు పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు యనమల సుధాకర్, చిత్తా రవిప్రకాశ్‌రెడ్డి, రఘునాధరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

కొండాపురంలో:పంచాయతీలు అభివృద్ధి పథంలో పయనించాలని ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు. స్థానిక స్థానిక వెలుగు కార్యాలయంలో పంచాయతీలు సొంత అభివృద్ధి నిధులు సమకూర్చుకోవడంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరులో:గ్రామ పంచాయతీలు ఆర్థిక వనరులు సృష్టించుకోవాలని ఎంపీడీవో రాధాక్రిష్ణవేణి పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో శుక్రవారం గ్రామ పంచాయతీల ఆదాయ వనరుల పెంపు పై సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రుడు, ఈవో లక్ష్మినరసింహులు, పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో: గ్రామ పంచాయతీలు ఓఎస్ఆర్ సాధించేందుకు అందరూ కృషిచేయాలని ఎంపీడీవో వెంకటరమణ పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలు ఓఎస్ఆర్‌పై శుక్రవారం కార్యదర్శులు, ప్రజాప్రతినిదులు, డిజిటల్ సహాయకులు, ఇంజినీరింగ్ సహాయకులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

పేదలకు భూమిని పంపిణీ చేయాలి

బద్వేలు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) :సర్వేనెంబరులో 1557 ఉన్న హెచ్చరిక బోర్డును తొలగించి పేదలకు ఎన్‌టీఆర్ గృహాలకు కేటాయించాలని సీపీఐ ఎంఎల్ నాయకులు పేర్కొన్నారు. ఆమేరకు ఆర్డీవో కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందజేశారు. అధికారులు స్పందించకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఆడపిల్లలను చదివిద్దాం

ప్రొద్దుటూరు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లను రక్షిద్దాం.. ఆడపిల్లను చదివిద్దాం అని వైఎంఆర్ కాలనీ పీహెచ్‌సీ డాక్టర్ హిమబిందు అన్నారు. శుక్రవారం సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ పరిధిలో సేవ్ ది గర్ల్ చైల్డ్ కార్యక్రమం నిర్వహించారు.

వేలం ద్వారా రూ.5.70లక్షలు ఆదాయం

ఖాజీపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నాగనాదేశ్వరుని కొండ పైభాగంలో తలనీలాలు, టెంకాయలకు వేలం పాట ద్వారా రూ.5.70లక్షలు ఆదాయం వచ్చింది. శుక్రవారం ఈవో సృజలశీల ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించగా తలనీలాలకు రూ.4.50 లక్షలు, టెంకాయలకు రూ.1.20 లక్షలు వేలంపాట పాడి నగదును అధికారులకు అందజేశారు. ఇన్‌స్పెక్టర్ శివయ్య పూజారులు తదితరులు పాల్గొన్నారు.

డివిజనల్ స్థాయి పోటీలకు ఎంపిక

ముద్దనూరు అక్టోబర్17(ఆంధ్రజ్యోతి)మండల పరిధి ఉప్పలూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు డివిజనల్ స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో నాగేశ్వరనాయక్ తెలిపారు.జిల్లా స్కూల్ గేమ్స్‌ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడలు నిర్వహించారు.

ఘనంగా భూపేశ్‌రెడ్డి జన్మదిన వేడుకలు

● ఆయురారోగ్యాలతో ప్రజాసేవకు అంకితం కావాలి ● మాజీ ఎమ్మెల్సీ దేవగుడి

జమ్మలమడుగు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహిం చారు. శుక్రవారం జమ్మలమడుగు టీడీపీ కార్యాలయ ఆవరణలో మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూపేశ్‌రెడ్డి ఆయురారోగ్యాలతో ప్రజలకు సేవ చేస్తూ ప్రజా సేవకే అంకితం కావాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదాన శిబిరాన్నిదేవగుడి ప్రారంభించారు. టీడీపీ ఇన్‌ఛార్జి భూపేశ్‌రెడ్డి జన్మదినం, వివాహం చేసుకున్న రోజు పురష్కరించుకుని నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, వైస్‌చైర్మన్ మల్లికార్జున, పొన్నతోట శ్రీను, మండల కన్వీనర్ చిన్నపసుపుల శ్రీనివాసులరెడ్డి, రామాంజనేయులు, సుధీర్‌రెడ్డి, టి.విశ్వనాథరెడ్డి, నవనీశ్వరరెడ్డి, పవన్, డి.సుధీర్, భాగ్యమ్మ, ఐఎల్ చిన్న, డాక్టర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి కూటమి నాయకులు

ఎర్రగుంట్లలో 30 మంది రక్తదానం

ఎర్రగుంట్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ జమ్మలమడుగు ఇన్‌చార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి జన్మదిన వేడు కల సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 30 మంది రక్తదానం చేశారు. అంతకు ముందు శుక్రవారం ఎర్ర గుంట్ల మండల ఇన్‌చార్జి మదుసూధన్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి భూపేశ్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సురక్ష సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో మండల కన్వీనర్ మేకల మోహన్‌రెడ్డి, కమిషనర్ శేషఫణి, టీడీపీ నాయకులు 30మంది రక్తదానం చేశారు. కార్యక్ర మంలో ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ ఆర్.నాగరాజు, జగదీశ్వరరెడ్డి పట్టణ అధ్యక్షుడు ఎస్.సంజీవరెడ్డి, జంగంరెడ్డి, ఎంపిటీసీ నవీన్, నాగభూషణరెడ్డి, చాంద్‌బాషా, సురేంద్రారెడ్డి, చిన్నసేట్, కొండారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, నరసింహారెడ్డి, హరి, పవన్ కుమార్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, ప్రసాద్, దానం, శేఖర్ పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న టీడీపీ. కన్వీనర్ మోహన్‌రెడ్డి, పక్కన మండల ఇన్‌చార్జి మధుసూధన్‌రెడ్డి

ముద్దనూరులో: జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు.టీడీపీ మండల అధ్యక్షుడు శివరామిరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు కేశవరెడ్డి, జగదీశ్వరరెడ్డి, శేఖర్‌నాయుడు, చంద్ర ఓబుళరెడ్డి, కుదుముల శశిధర్‌రెడ్డి,రంగారెడ్డి,రామసుబ్బారెడ్డి,రామకృష్ణారెడ్డి, మహేశ్వరరెడ్డి,టీడీపీ క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.


భూపేశ్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ తినిపించుకుంటున్న టీడీపీ నాయకులు

కొండాపురంలో: మండలంలో పలుచోట్ల జమ్మలమడుగు టీడీపీ ఇన్‌ఛార్జ్ భూపేశ్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కేక్ కట్‌చేసి స్వీట్లు తినిపించుకున్నారు. జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రిలో మండలానికి చెందిన కూటమి నాయకులు రమేష్‌రెడ్డి, అరుణ్‌కుమార్ రెడ్డి, నాగిరెడ్డిలు రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, కూటమి నాయ కులు శ్రీరామ్(బాబు)రెడ్డి పాల్గొన్నారు.


కొండాపురం టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

మైలవరంలో: జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి జన్మదిన వేడుకలను నవాబుపేట గ్రామ యూత్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ యువకులు తమ నేత పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ఆర్‌డీఎస్ఎస్ పనుల పరిశీలన

మైదుకూరు అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు 24 గంటల విద్యుత్ అందించడానికి మండల పరిదిలోని రాయప్పగారిపల్లి జరుగుతున్న ఆర్‌డీఎస్ఎస్ పథకం పనులను శుక్రవారం ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ లోతేటి శివశంకర్ పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన అదికారులతో సమీక్ష నిర్వహించి నాణ్యతతో పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆ పర్యటనలో ఎస్ఈ రమణ, ఈఈ లు లక్ష్మీపతి, నాగరాజు, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ లోతేటి శివశంకర్

ఇంటి పన్నుల పెంపుపై దృష్టి సారించండి

ప్రొద్దుటూరు , అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నుల పెంపులో దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన 46 సచివాలయ అడ్మిన్ సెక్రటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో కొత్తగా నిర్మించిన ఇళ్లకు వెంటనే కొలతలు తీసుకుని పన్నులు వేయాలన్నారు. అసలు నిర్మాణం జరుగుతున్నప్పుడే వాటికి ప్లాను ఉందా లేదా పరిశీలించాల్సిన బాధ్యత ప్లానింగ్, అడ్మిన్ సెక్రటరీలకు ఉందన్నారు. ప్రతి వార్డుల పరిధిలో కొత్తగా ఇంటి నిర్మాణాలు ఎన్ని జరిగాయి అదనపు ఫ్లోర్ నిర్మాణాలు జరిగాయి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వ భవనాలకు ఉన్న పన్ను బకాయిలపై సంబంధింత డిపార్ట్‌మెంట్‌లకు నోటీసులు ఎన్ని సార్లు ఇచ్చారో తెలపాలన్నారు. సమావేశంలో ఆర్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.


అడ్మిన్ సెక్రటరీలతో సమీక్షిస్తున్న కమిషనర్ రవిచంద్రారెడ్డి

మండల టీడీపీ నాయకుడు రెడ్డయ్యకు పరామర్శ

అట్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల ఇన్‌ఛార్జ్ పోతిరెడ్డి రెడ్డయ్యను శుక్రవారం బద్వేలు నియోజకవర్గం సమన్వయ కర్త రితీష్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల రెడ్డయ్య అనారోగ్యంతో ఏలూరుకు వెళ్లి చికిత్స పొంది ఇంటికి వచ్చి విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న రితీష్‌కుమార్‌రెడ్డి రెడ్డయ్యను పరామర్శించి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. బద్వేలు మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు హోండాషోరూం రవి, సుధాకర్‌రెడ్డి మండల యువ నాయకులు పాలకొండు రాజశేఖర్‌రెడ్డి, పెంచల్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, అయ్యవారయ్య, వెంకటేశ్, టీడీపీ నాయకులు కార్యకర్తలు పరామర్శించిన వారిలో ఉన్నారు.


అట్లూరు మండల ఇన్‌చార్జి రెడ్డయ్యను పరామర్శిస్తున్న రితీష్‌రెడ్డి

వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తతగా ఉండాలి

గోపవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, మెదడువాపు తదితర వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సబ్‌యూనిట్ ఆఫీసరు టి.నరసింహారెడ్డి తెలిపారు. గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఇంటింటికి వెళ్లి లార్వా, ఫీవర్ చేయించి ప్రజలకు దోమకాటు ద్వారా కలిగే వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసరు గౌస్‌బాషా, హెల్త్ అసిస్టెంటు, ఖాసిం, ఆశా కార్యకర్తలు, స్కూలు ప్రధాన ఉపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.